
అధ్వానంగా మారిన జాతీయ రహదారి


సుష్మా వద్ద కంకర తేలిన రోడ్డు


ఎల్‌బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీ సమీపంలో ఇలా..

గుంతల రోడ్లు..

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు!


వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలతో పాటు ప్రధాన రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు చిరునామాలుగా మారాయి. గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్‌ నుంచి అల్కాపురి వరకు జతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చింతకుంట నుంచి హయత్‌నగర్‌ మధ్య జాతీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. జాతీయ రహదారి పనుల కారణంగా అటుగా వెళ్లలేక కాలనీల నుంచి వెళ్దామంటే అంతర్గత రోడ్లు సైతం గుంతలతో దర్శనమిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని శివారు కాలనీలలో రోడ్లు మరీ దారుణంగా మారాయి. శివారు కాలనీల్లో దాదాపుగా అన్ని మట్టి రోడ్లే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని కాలనీల వాసులు వాపోతున్నారు. పలు కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లు ఉన్నా స్థానికులకు ఇబ్బందులు తప్పటం లేదు.సీసీ, బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు. –ఎల్‌బీనగర్‌


మన్సూరాబాద్ మల్లికార్జుననగర్‌లో..

మౌలిక వసతుల కల్పనకు కృషి


జలమండలి అధికారులతో సమావేశమైన కార్పొరేటర్‌

ఎల్‌బీనగర్‌: శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్‌ పరిధిలోని శివారు కాలనీలవాసులు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నామని కార్పొరేటర్‌ దృష్టికి తీసుకురావడంతో మంగళవారం ఆయన జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌లను వెంటనే ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజగోపాల్‌, కాలనీల సంక్షేమ సంఘం నాయకులు నందకిషోర్‌, చిత్రంజన్‌, శ్రీశైలం, సత్యనారాయణ, యాదిరెడ్డి, రమేష్‌కుమార్‌, రాజు గౌడ్‌, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.47, వంకాయ రూ.35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 40, కాకర రూ. 38, బీర రూ. 38, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్‌ రూ. 85, క్యారెట్‌ రూ. 45, దొండ రూ. 35–40, చిక్కుడు రూ. 35–65, గోకర రూ. 40, బీట్‌రూట్‌ రూ. 25, క్యాప్సికం రూ. 65, ఆలు రూ. 37, దోస రూ. 40, సొర రూ. 17, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 37. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

తరచూ గొడవలు

పలువురిపై కేసు

నాగోలు: తరచూ గొడవలు పడుతున్న రెండు కుటుంబ సభ్యులపై కేసు నమోదైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు గ్రామానికి చెందిన బైకాన్‌ మల్లేష్‌, బైకాన్‌ సతీష్‌ యాదవ్‌, బైకాన్‌ మహేష్‌ యాదవ్‌, బైకాన్‌ సాయిలు యాదవ్‌, బైకాన్‌ బాలకృష్ణయాదవ్‌, నాగోలు కోఆపరేటివ్‌ బ్యాంక్‌ కాలనీకి చెందిన మైలశ్రీనివాస్‌ కురుమ, నాగోలు గ్రామానికి చెందిన యెగ్గె కృష్ణ, మైల సాయి కుమార్‌, కర్రె శివలు, బైకాన్‌ మల్లేష్‌ కుటుంబ సభ్యులతో గత కొన్ని ఏళ్లుగా గొడవ పడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ఈ నెల 13న మరోసారి గొడవ జరగడంతో పరస్పర ఫిర్యాదు మేరకు ఇరు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి బైండోవర్‌ చేశారు. మరోసారి గొడవ పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై..

నాగోలు: బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బండ్లగూడ రాజీవ్‌ స్వగృహలో సాయి అనే యువకుడు మద్యం మత్తులో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ప్రశ్నించిన మహిళలను తిడుతూ దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.

యూటర్న్‌లు లేక ఇబ్బందులు


జాతీయ రహదారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌

లింగోజిగూడ: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా యూటర్న్‌లు తీసేయడంతో కాలనీవాసులు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని హయత్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ నవ జీవన్‌ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ట్రాఫిక్‌ అధికారులతో కలిసి జాతీయ రహదారిని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. హయత్‌నగర్‌లో యూటర్న్‌ తీసుకోవాలంటే మూడు కిలో మీటర్లు తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పనుల్లో ఆలస్యం జరుగుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు దాటాలంటే నానా ఇక్కట్లక గురి కావాల్సి వస్తోందన్నారు. భాగ్యలత సమీపంలో యూటర్న్‌ ఏర్పాటు చేయడంతో పాటు ఎఫ్‌ఓబీని నిర్మించాలన్నారు. అనంతరం అడిషనల్‌ ట్రాఫిక్‌ డీసీపీ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బండారి భాస్కర్‌, పొరంద మహేష్‌, గోవింద చారి, గంగాని శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


ట్రంక్‌లైన్‌ పనులను పరిశీలిస్తున్న సుజాతానాయక్‌

హస్తినాపురం: నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. డివిజన్‌ పరిధి ద్వారకాతిరుమల్‌ కాలనీ నుంచి రెడ్డికాలనీ వరకు జరుగుతున్న ట్రంక్‌లైన్‌ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పనులు పూర్తయితే వివిధ కాలనీల వాసులకు వరదనీటి సమస్య తీరుతుందన్నారు. కార్పొరేటర్‌ వెంట ఏఈ మల్లికార్జునగౌడ్‌, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

రాయితీపై ఆయిల్‌పామ్‌ సాగుకు ప్రోత్సాహం

మహేశ్వరం: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీగా రాయితీ అందిస్తోందని, ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఉద్యానవన అధికారిణి సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. పామాయిల్‌ మొక్క ఒకటి రూ.200 ఉండగా రైతులకు 90 శాతం సబ్సిడీలో రూ.20లకే అందజేస్తున్నామని తెలిపారు. ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటుందన్నారు. మొక్కల రాయితీపై ఎకరాల్లో ఎటువంటి పరిమితి లేదు. ఆయిల్‌ పామ్‌ రైతులకు డ్రిప్‌ రాయితీ అందిస్తున్నామన్నారు. డ్రిప్‌ రాయితీ 12.5 ఎకరాలకు పరిమితం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ అందిస్తున్నారని తెలిపారు. యూనిట్‌ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ రైతులకు 80–90 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్‌ పామ్‌ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.4200 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తారని, నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలవుతుందన్నారు. పండ్ల తోటలు వేసుకునే రైతులకు 3 సంవత్సరాల పాటు మెయింటనెన్స్‌ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మల్చింగ్‌ వేసుకునే రైతులకు 50 శాతం రాయితీ, నీటి కుంటలకు 50 శాతం రాయితీ, కూరగాయ పందిర్లకు 50 శాతం రాయితీ, వెదురు మొక్కలపై రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. జీడిమెట్ల నుంచి రైతులకు ఉచితంగా టమాటా, వంకాయ, మిర్చీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌, నారును ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. నారు అవసరం ఉన్న రైతులు 30రోజుల ముందుగా మండల ఉద్యానవన అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం మహేశ్వరం వ్యవసాయ, ఉద్యానవన అధికారుల కార్యాలయాలను, మండల ఉద్యానవన అధికారి సౌమ్య ఫోన్‌ నెంబర్‌ 8977714221 సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలోని చిలుకానగర్‌ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం చిలుకానగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ బన్నాల గీతాప్రవీణ్‌ ముదిరాజ్‌ స్థానికులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. శ్రీనగర్‌కాలనీలో రూ. 26 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని లేదంటే సహించేది లేదని సూచించారు. ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. వర్షపు నీరు రోడ్డు మీద నిల్వకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్‌ తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. అండర్‌–14 ప్రోకబడ్డీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై న నాగోల్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, షూస్‌లను ఏసీపీ నరేష్‌ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ గుప్తా మాట్లాడుతూ.. క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఏసీపీ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాణించాలని చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌, మమత, వెంకటేష్‌, రవి కుమార్‌ జయప్రద ,మాధవి, విమల తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి


కాలనీవాసులతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

నాగోలు: నగరంలో ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టి భూగర్భ జలాలు పెంచుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మంగళవారం నాగోలు గ్రామం, అయప్పకాలనీలో జరుగుతున్న సీవరేజీ తొలగింపు కార్యక్రమాన్ని జనరల్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్‌ చింతల అరుణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన నీటి సంరక్షణ, పారిశుధ్యాన్ని నిర్ధారిస్తూ నీటి కొరత రాకుండా కృషి చేస్తామన్నారు. ముగుగు పొంగిపొర్లుతున్న సవాళ్లకు శాశ్వత పరిష్కారాలను చూపడమే జలమండలి లక్ష్యమన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకుని భవిష్యత్‌ తరాల కోసం నీటిని కపాడాలన్నారు. డ్రైనేజీ మ్యాన్‌ హోళ్లలో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 90 రోజుల్లో సీవరేజీ పైప్‌లైన్లలో వ్యర్థాలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాలనీవాసులకు ఇంకుడు గుంతల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్‌ స్వామి, సీజీఎం నాగేశ్వర్‌, డీజీఎం మాధవి, మేనేజర్‌ అర్చన సీవరేజీ సూపర్‌వైజర్‌ రమేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు క్విజ్‌ పోటీలు

చంపాపేట: ఆర్క్‌ డెవలప్‌మెంట్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్రిస్టేజ్‌ సమావేశ మందిరంలో క్విజ్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. బాలాపూర్‌, సరూర్‌నగర్‌ మండల పరిధిలో ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ఎలాంటి రుసుం లేకు ండా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి భ కనబరిచిన వారికి జ్ఞాపికలు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని ఆసక్తి ఉన్న వారు 7670997065 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నూతన కమిటీని ఎన్నుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ అల్కాపురి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమిటీ కాల పరిమితి పూర్తయినా పాత కమిటీనే కొనసాగుతుందని వెంటనే కొత్త కమిటీని ఎన్నుకోవాలని కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు కామేశ్వరరావు, ఇతర సభ్యులు సోమవారం రాత్రి పార్క్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత కమిటీ పాలకవర్గం కాలనీ బైలాస్‌కు విరుద్ధంగా కొనసాగుతుందని ఆరోపించారు. సమస్యలపై ప్రశ్నించిన సభ్యులకు సరైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేస్తున్నారని కాలనీ అభివృద్ధి దృష్ట్యా నూతన కమిటీని ఎన్నుకోవాలన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయికులు

మన్సూరాబాద్‌: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని ఆ పార్టీ మన్సూరాబాద్‌ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్‌ అన్నారు. డివిజన్‌ పరిధి వీకర్‌ సెక్షన్‌కాలనీలో మంగళవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కువ సభ్యత్వాలు ఉన్న పార్టీ బీజేపీ ఒక్కటే అన్నారు. పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్‌, హరీష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌, ఎల్లారెడ్డి, శ్యామ్‌, అశోక్‌ పాల్గొన్నారు.

సన్మానం


మధుయాష్కీగౌడ్‌ను సన్మానిస్తున్న రఘుమారెడ్డి

చంపాపేట: రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధు యాష్కీ గౌడ్‌ను మంగళవారం కర్మన్‌ఘాట్‌ శ్రీధ్యానాంజనేయ ఆలయ మాజీ చైర్మన్‌ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లేష్‌, నాయకులు గూడూరి గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.


డీజీఎంను సన్మానిస్తున్న దృశ్యం

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట సబ్‌ డివిజన్‌–1లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జలమండలి డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ హస్మత్‌అలీ అన్నారు.మంగళవారం ఓల్డ్‌ మలక్‌పేట జలమండలి కార్యాలయంలో కాంగ్రెస్‌ పార్టీకి చెందిన బాబు శ్రీనివాస్‌, చౌకి రవికుమార్‌ డీజీఎంను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న యువకుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్‌ బాలికపై లైంగిక దాడికి పాల్పడి పెళ్లి చేసుకున్న ఓ యువకుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ సునితా బర్ల వివరాల ప్రకారం.. వనస్థలిపురం ఠాణా పరిధిలో బాలిక (16) తన తల్లితో కలిసి నివాసముంటూ స్థానికంగా ఇంటర్‌ మొదటి సంవత్సరం చదువుతుంది. అదే ప్రాంతంలో నివసించే అనీల్‌(22) బాలికకు వరసకు బావ అవుతాడు. చుట్టరికాన్ని అడ్డం పెట్టుకుని అనీల్‌ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2019 జనవరి 18న బయటకి వెళ్లిన కూతురు ఎంతకీ రాకపోవడంతో తల్లి పోలీసులకి ఫిర్యాదు చేసింది. అదే రోజు సాయంత్రం అనీల్‌ సదరు బాలికను పెళ్లి చేసుకుని రావడంతో పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ బాలికకు రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేశారు.

ఆలోచనలను ఆచరణలో పెడితే యువత రాణిస్తారు

డా.హిప్నో పద్మాకమలాకర్‌



చిక్కడపల్లి: దేశాభివృద్ధిలో యువత పాత్రకు ఎంతో ప్రాముఖ్యం ఉందని నవభారత లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షురాలు డాక్టర్‌ హిప్నో పద్మాకమలాకర్‌ అన్నారు. మంగళవారం అశోక్‌ నగర్‌ క్రాస్‌రోడ్డులో జరిగిన 'యువత –సవాళ్లు'అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. యువత తమ ఆలోచనలను ఆచరణలో పెడితే రాణిస్తారని అన్నారు. జీవన ప్రయాణంలో కష్టాలు, వైఫల్యాలు ఎదురవుతాయని వాటిని అధిగమించి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌.రఘు, ప్రముఖులు కృష్ణవేణి, స్వరూపరాణి, శోభారాణి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


పోచయ్య

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన లారీ డ్రైవర్‌ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌ పరిధి కుత్బుల్లాపూర్‌కు చెందిన రాపోలు పోచయ్య(38) లారీ డ్రైవర్‌. గతంలో భార్య జ్యోతితో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత వచ్చాడు. ఇటీవల వెళ్లిన పోచయ్య ఎంతకీ రాకపోవడంతో జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365